క్లుప్తంగా

నూతన మార్గదర్శకాల రద్దుకు వినతి



సుందరవల్లికి వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): బీసీఏ, బీబీఏ కోర్సులకు ఏఐసీటీఈ తీసుకొచ్చిన నూతన మార్గదర్శకాలను రద్దు చేయాలని అన్ ఎయిడెడ్ డిగ్రీ, పీజీ కళాశాలల అసోసియేషన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి కోరారు. ఈ మేరకు విక్రమ సింహపురి వర్సిటీ ఎదుట నిరసనను మంగళవారం చేపట్టిన అనంతరం వీసీ సుందరవల్లికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఏఐసీటీఈ నిబంధనలతో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందని చెప్పారు. నూతన నిబంధనల మేరకు ప్రైవేట్ డిగ్రీ కళాశాలలకు 30 ఏళ్ల లీజు అగ్రిమెంట్.. 20 వేల చదరపు అడుగుల భవనం ఉండాలనడం సరికాదని పేర్కొన్నారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు రాజ్‌కుమార్‌చౌదరి, కార్యదర్శి మనోహర్‌రెడ్డి, సభ్యులు వెంకట్‌రెడ్డి, శివసాకేత్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న రాణి

నెల్లూరు (వేదాయపాళెం): బాలికల సంరక్షణ బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఐటీడీఏ పీఓ మందా రాణి పేర్కొన్నారు. జాతీయ బాలికా దినోత్సవాన్ని పురస్కరించుకొని బాలికల సంరక్షణ చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని కొండాయపాళెం గేట్ సెంటర్‌లోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. గిరిజన ప్రాంతాల్లో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని.. చైతన్యం కల్పించి వీటిని అరికట్టాల్సిన అవసరం ఉందని చెప్పారు. జిల్లా బాలల సంరక్షణాధికారి సురేష్, జిల్లా గిరిజన సంక్షేమాధికారి పరిమళ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు రమేష్, శ్రీనివాసరావు, శాంతకుమారి, అంకయ్య తదితరులు పాల్గొన్నారు.

'డీకేడబ్ల్యూ'లో శిక్షణ తరగతులు



నెల్లూరు (టౌన్): నగరంలోని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో శిక్షణ తరగతులను యూనిసెఫ్ సహకారంతో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమాన్ని కళాశాలల కమిషనర్ పోలా భాస్కర్ వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ గిరి మాట్లాడారు. సెల్ఫ్ డైరెక్టెడ్ ఎమోషనల్ లెర్నింగ్ ఫర్ ఎంపథీ అండ్ కైండ్‌నెస్ అండ్ సోషల్ ఎమోషనల్ లెర్నింగ్ అనే అంశంపై శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని చెప్పారు. జిల్లాలోని తొమ్మిది ప్రభుత్వ కళాశాలల్లో శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. రోజూ 60 మంది అధ్యాపకులకు శిక్షణ ఇవ్వనున్నామన్నారు. ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్‌గా రమణరావు వ్యవహరించారు.

వైఎస్సార్‌సీపీ నేతల ప్రచారం

నెల్లూరు(బారకాసు): రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున నెల్లూరు రూరల్, ఎంపీ అభ్యర్థులుగా పోటీ చేయనున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని జేసీఎస్ మండల ఇన్‌చార్జి మొయిళ్ల సురేష్‌రెడ్డి కోరారు. ఈ మేరకు 21వ డివిజన్లో గడప గడపకూ ప్రచారాన్ని మంగళవారం నిర్వహించారు. నేతలు పెంచలనర్సారెడ్డి, రాజారెడ్డి, మధు, సుబ్బారావు, మాల్యాద్రి, సాయి, బుజ్జన్న పాల్గొన్నారు.

చండీహోమం రేపు

నెల్లూరు(బృందావనం): పుష్య పౌర్ణమిని పురస్కరించుకొని మూలాపేటలోని శంకరమఠంలో చండీహోమాన్ని గురువారం నిర్వహించనున్నామని మఠం నిర్వాహకులు కొత్రపాటి నందకిషోర్, ఉషాకుమారి దంపతులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంచికామకోటి పీఠానికి చెందిన వేదపండితుల ఆధ్వర్యంలో హోమాన్ని నిర్వహించనున్నామని చెప్పారు.

అబద్ధాలు నిజాలవుతాయనే భ్రమలో నారాయణ



సమస్యలను ఆరాతీస్తున్న అనిల్‌కుమార్

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): అబద్ధాలు చెప్తే నిజాలైపోతాయనే భ్రమలో టీడీపీ నేత నారాయణ ఉన్నారని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ విమర్శించారు. నగరంలోని 46వ డివిజన్లో గల ఆచారి వీధి, పణతులవారి వీధి, కాకర్లవారి వీధి తదితర ప్రాంతాల్లో అధికారులతో కలిసి మంగళవారం పర్యటించిన ఎమ్మెల్యే మాట్లాడారు. బృందావనంలో రోడ్లు, డ్రెయిన్ల పనులు జరుగుతున్నాయని చెప్పారు. మండపాలవీధి, కాకర్లవారి వీధిలో రోడ్లు మినహా మిగిలిన అన్ని ప్రాంతాల్లో పనులు దాదాపు పూర్తయ్యాయని వివరించారు. ఈ పనులను తమ ప్రభుత్వ హయాంలో చేపట్టామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో స్థానిక డివిజన్లో ఒక్క రోడ్డును సైతం నిర్మించలేదని.. అయితే నగరాన్ని అభివృద్ధి చేశానని నారాయణ చెప్పుకొంటున్నారని విమర్శించారు. 43, 44, 46, 47వ డివిజన్లలో వ్యాపార సంస్థలు ఎక్కువగా ఉన్నాయని, ఇప్పటి వరకు ఎవర్నీ ఇబ్బంది పెట్టిన దాఖలాల్లేవని తెలిపారు. రానున్న ఎన్నికల్లోనూ తనను ఆశీర్వదించాలని కోరారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్ వేలూరు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలతో ఆర్థికంగా ఎదగాలి

• రాజ్యసభ సభ్యుడు నాబం రేబియా



కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన

నెల్లూరు(బారకాసు): కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని అరుణాచల్‌ప్రదేశ్‌కు చెందిన రాజ్యసభ సభ్యుడు నాబం రేబియా పేర్కొన్నారు. వికసిత్ భారత్ సంకల్ప యాత్రలో భాగంగా కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై ప్రచార వాహనం, శిబిరాల ద్వారా అవగాహన కార్యక్రమాలను బారకాస్ సెంటర్ మహబూబ్‌ఖాన్ పార్క్, పూలే విగ్రహ కూడలిలో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. ఆయుష్మాన్ భారత్ ద్వారా దేశంలో ఎక్కడైనా కార్పొరేట్ హాస్పిటళ్లలో రూ.ఐదు లక్షల వరకు వైద్యాన్ని ఉచితంగా పొందవచ్చని చెప్పారు. వివిధ పథకాలపై అవగాహన కల్పించారు. బీజేపీ నేతలు వాకాటి నారాయణరెడ్డి, సురేష్‌రెడ్డి, సురేంద్రరెడ్డి, ఆంజనేయరెడ్డి, మిడతల రమేష్, కందికట్ల రాజేశ్వరి, డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, సెక్రటరీ హేమావతి తదితరులు పాల్గొన్నారు.

డైరీల ఆవిష్కరణ



జెడ్పీ కార్యాలయంలో..



విద్యుత్ భవన్‌లో..

నెల్లూరు (పొగతోట): ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ డైరీని జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ ఆవిష్కరించారు. నగరంలోని జెడ్పీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో సీఈఓ చిరంజీవి, అసోసియేషన్ నేతలు లక్కాకుల పెంచలయ్య, రమేష్‌బాబు, ఏఓలు కొండయ్య, శైలజ, విజయరాణి, జయలక్ష్మి, ప్రభావతి, భీమ్‌రెడ్డి, మాబాషా తదితరులు పాల్గొన్నారు.

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ ముస్లిం మైనార్టీ అసోసియేషన్ డైరీ, క్యాలెండర్లను ఎస్పీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ సురేష్, జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ ఆవిష్కరించారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో గల ఎస్ఈ చాంబర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర జనరల్ సెక్రటరీ అల్తాఫ్, సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్ మురళి, అసోసియేషన్ డిస్కమ్ అధ్యక్షుడు నవాబ్‌జానీ, రీజినల్ సెక్రటరీ రఫీ, సభ్యులు నసరుల్లా, జక్రియా, ముస్తఫా, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.

సుభాష్ చంద్రబోస్‌కు ఘన నివాళి



సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళులు



కొండాయపాళెంలోని ఎంపీపీ స్కూల్లో..

నెల్లూరు (టౌన్): కొండాయపాళెంలోని నగరపాలక ప్రాథమిక పాఠశాలలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రధానోపాధ్యాయుడు భాస్కర్‌రావు, విద్యార్థులు నివాళులర్పించారు. ఉపాధ్యాయుడు హరీష్ తదితరులు పాల్గొన్నారు

• కొండాయపాళెంలోని ఎంపీపీ మెయిన్ స్కూల్లో సుభాష్ చంద్రబోస్ జయంతిని బాలభవన్ డైరెక్టర్ సుభద్రాదేవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయుడు రామయ్య తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా కల్యాణం



ఉదయవర్ల దేవస్థానంలో..



ఆంజనేయస్వామి దేవస్థానంలో..

నెల్లూరు(బృందావనం): ధర్మ ప్రచార వారోత్సవాలను పురస్కరించుకొని నవాబుపేటలోని ఉదయవర్ల దేవస్థానంలో శ్రీదేవీ, భూదేవీ సమేత తల్పగిరి రంగనాథస్వామి కల్యాణ మహోత్సవాన్ని కనులపండువగా మంగళవారం నిర్వహించారు. భజనలు, భక్తి గీతాలను మహేష్ బృంద ఆధ్వర్యంలో ఆలపించారు. ఈఓ వెంకటేశ్వర్లు, ధర్మకర్తల మండలి చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, కార్పొరేటర్ కామాక్షి తదితరులు పాల్గొన్నారు.

• రాయాజీవీధిలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఈఓ ఆరంబాకం వేణుగోపాల్, ధర్మకర్తల మండలి చైర్మన్ లోకిరెడ్డి వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కాత్యాయని వ్రతం



నెల్లూరు(బృందావనం): నగరంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవస్థానంలో కాత్యాయని వ్రతాన్ని వేడుకగా మంగళవారం నిర్వహించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులురెడ్డి, ధర్మకర్తల మండలి చైర్మన్ రత్నం జయరామ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు



నెల్లూరు రూరల్: కొత్తూరులోని కేంద్రీయ విద్యాలయంలో పరీక్షలపై చర్చ, విద్యార్థులకు చిత్రలేఖన పోటీలను మంగళవారం నిర్వహించారు. తొమ్మిది నుంచి 12వ తరగతి చదువుతున్న 100 మంది విద్యార్థులు హాజరయ్యారు. విజేతలకు డిజిటల్ సర్టిఫికెట్లతో పాటు స్వాతంత్య్ర సమరయోధుల జీవిత చరిత్ర పుస్తకాలను అందజేశారు. ప్రిన్సిపల్ శంకరయ్య, ప్రధానోపాధ్యాయుడు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యత ప్రమాణాలతో గోదాము నిర్మాణం



పరిశీలిస్తున్న కోటేశ్వరరెడ్డి

నెల్లూరు రూరల్: నరుకూరులో మార్కెటింగ్ గోదామును నాణ్యత ప్రమాణాలతో నిర్మించాలని నెల్లూరు ఏఎంసీ చైర్మన్ కోటేశ్వరరెడ్డి ఆదేశించారు. నిర్మాణంలో ఉన్న గోదాము పనులను మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. ఇక్కడ గోదాము నిర్మాణానికి 2018లో రూ.మూడు కోట్లు మంజూరు కాగా, పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ అసంపూర్తిగా వదిలేశారని చెప్పారు. ఈ క్రమంలో సమస్యను ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో పనులను కొనసాగించేందుకు చర్యలు చేపట్టారని తెలిపారు.

గణతంత్ర దినోత్సవానికి ఏర్పాట్లు చేయండి



మాట్లాడుతున్న వికాస్ మర్మత్

నెల్లూరు(బారకాసు): గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. కార్పొరేషన్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని నగరంలోని కస్తూర్బా కళాక్షేత్రంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించాలని సూచించారు. వేడుకల్లో పాల్గొనే వారికి అన్ని వసతులను కల్పించాలని తెలిపారు.

రూ.30 లక్షలతో శ్మశాన వాటిక అభివృద్ధి



మాట్లాడుతున్న నేతలు

నెల్లూరు(బారకాసు): నగరంలోని 32వ డివిజన్లో గల ముస్లిం శ్మశాన వాటికను రూ.30 లక్షలతో అభివృద్ధి చేశారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ముస్లిం నేతలు పేర్కొన్నారు. డివిజన్లోని శ్మశాన వాటికలో లైటింగ్ పనులను మంగళవారం పరిశీలించిన అనంతరం వారు మాట్లాడారు. ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి సహకారంతో.. కార్పొరేటర్ తాళ్లూరు అవినాష్ చొరవతో శ్మశాన వాటికను అభివృద్ధి చేసుకుంటున్నామని చెప్పారు. నేతలు అజీజ్, గౌస్‌బాషా, సర్దార్, మంజూర్, హఫీజ్ సల్మాన్, జావీద్, రహీం, సయ్యద్ ఆసిఫ్, షఫీ, షమ్మీ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల యాజమాన్యం కీలకం



పంటను పరిశీలిస్తున్న అధికారులు

నెల్లూరు రూరల్: వరి సాగులో ఎరువుల యాజమాన్యం ఎంతో అవసరమని ఏడీఏ శ్రీనివాసులు పేర్కొన్నారు. దొంతాలి, ఆమంచర్ల, మన్నవరప్పాడు గ్రామాల్లో వరి పొలాలను రూరల్ వ్యవసాయాధికారి నాగమోహన్‌తో కలిసి మంగళవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. రైతులకు అవసరమైన సలహాలను వ్యవసాయ శాఖ ద్వారా ఎప్పటికప్పుడు అందిస్తున్నామని, వీటిని పాటించాలని కోరారు.

మహాసభల జయప్రదానికి పిలుపు



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర రెండో మహాసభను జయప్రదం చేయాలని యూనియన్ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు పిలుపునిచ్చారు. మహాసభల పోస్టర్లను నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం విడుదల చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. నగరంలోని జెట్టి శేషారెడ్డి భవన్‌లో ఈ నెల 28వ తేదీ ఉదయం తొమ్మిది గంటలకు మహాసభను ప్రారంభించనున్నారని వివరించారు. పలు తీర్మానాలను ఆమోదించనున్నామని చెప్పారు. సుమన్, ఆరిఫ్, మౌలా, శ్రీను, మురళి, రమేష్, రమణ, రవి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఎంఈఓ కార్యాలయ ఎదుట నిరసన



నెల్లూరు రూరల్: ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలంటూ బీటీఏ ఆధ్వర్యంలో నిరసనను నగరంలోని ఎంఈఓ కార్యాలయం ఎదుట మంగళవారం చేపట్టారు. అనంతరం ఎంఈఓ బిక్షాలు, అర్బన్ తహసీల్దార్ కార్యాలయంలో డీటీ నాగేశ్వరరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. తిరుపతయ్య, కిరణ్‌కుమార్, పెంచలప్రసాద్, వాణిశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా రేపు

నెల్లూరు(మినీబైపాస్): ఆటోనగర్‌లోని జిల్లా ఉపాధి కార్యాలయంలో జాబ్ మేళాను గురువారం నిర్వహించనున్నామని జిల్లా ఉపాధి అధికారి రామాంజనేయులు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అపోలో హాస్పిటల్స్‌లో ఫార్మసిస్ట్, ఫార్మసీ అసిస్టెంట్.. శ్రీరామ్ సిటీ యూనియన్ ఫైనాన్స్‌లో మార్కెటింగ్, రికవరీ ఎగ్జిక్యూటివ్‌ల నియామకానికి ఇంటర్వ్యూలను నిర్వహించనున్నారని చెప్పారు. డీ ఫార్మసీ, ఎమ్ ఫార్మసీ, పది నుంచి డిగ్రీ వరకు చదివిన వారు అర్హులని, ఆసక్తి గల వారు ఉదయం 10.30కు హాజరుకావాలని కోరారు.

నెల్లూరు వెల్ఫేర్ ఫెడరేషన్ సమావేశం



కమిషనర్‌ను సత్కరిస్తున్న నిర్వాహకులు

నెల్లూరు(బారకాసు): నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని నెల్లూరు వెల్ఫేర్ ఫెడరేషన్ సర్వసభ్య సమావేశాన్ని రామ్మూర్తినగర్‌లోని పద్మావతి కమ్యూనిటీ హాల్లో మంగళవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన కమిషనర్ వికాస్ మర్మత్‌ను నిర్వాహకులు సత్కరించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ గైడెన్స్ పుస్తకం.. నెల్లూరు మేరీ జాన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్పొరేటర్ శ్రీకాంత్‌రెడ్డి, ఫెడరేషన్ నిర్వాహకులు కృష్ణయ్య, చంద్రశేఖర్‌రెడ్డి, ప్రసాద్, సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

మర్యాదపూర్వకంగా..



నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డిని నగరంలోని ఆయన నివాసంలో డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు,, బీఎం వెంకటస్వామి, పాలకమండలి సభ్యులు మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందజేశారు. మహాజన సభలో చర్చించిన పలు అంశాలను మంత్రికి తెలియజేశారు. డీసీఎమ్మెస్‌కు చెందిన పాత రైస్‌మిల్లు స్థానంలో కల్యాణ మండపం, షాపింగ్ కాంప్లెక్స్, డీసీఎమ్మెస్ కార్యాలయ భవనాలను నిర్మించేలా చర్యలు చేపట్టాలని కోరారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై ప్రతిపాదనలు రూపొందించండి



మాట్లాడుతున్న కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు అవసరమైన భూములను గుర్తించి ప్రతిపాదనలను ఈ నెల 27 నాటికి తయారు చేయాలని జేసీ కూర్మనాథ్ సూచించారు. నగరంలోని తన చాంబర్‌లో మంగళవారం నిర్వహించిన జర్నలిస్టుల హౌసింగ్ కమిటీ రెండో సమావేశంలో జేసీ మాట్లాడారు. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాల కేటాయింపునకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తున్న నేపథ్యంలో ఆర్డీఓలు ప్రత్యేక శ్రద్ధ వహించి తదుపరి సమావేశానికి ప్రతిపాదనలతో రావాలని సూచించారు. కమిటీ సభ్యులు మస్తాన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, కందుకూరు సబ్ కలెక్టర్ విద్యాధరి, ఆర్డీఓలు మలోల, శీనానాయక్, మధులత, జిల్లా సమాచార, పౌర సంబంధాల అధికారి సదారావు, ఏపీఆర్వో రవీంద్ర పాల్గొన్నారు.